క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హసీనా సుల్తానా



మడకశిర: మడకశిర ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హసీనా సుల్తానా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ముర్షావలీపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రొళ్ల తహసీల్దార్ హసీనా సుల్తానాను మడకశిర ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి

మడకశిర: స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా వివిధ ఉచిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 4 నెలల పాటు శిక్షణ అనంతరం ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ సాయి గణేష్ 9966682246, 6303821442 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో



ప్రమాద స్థలంలో గాయపడిన యువకుడు

పెనుకొండ రూరల్: అతివేగంతో వచ్చిన బొలెరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చిన్నపరెడ్డిపల్లికి చెందిన ముఖేష్ తన ద్విచక్ర వాహనంలో గుట్టూరు వైపు నుంచి పెనుకొండ వైపునకు వెళ్తున్నాడు. మార్గంమధ్యలో కియా మెయిన్ గేట్ వద్దకు రాగానే పెనుకొండ వైపు నుంచి కియా పరిశ్రమలోకి వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన అతడ్ని హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అశోక్ కుమార్

మడకశిరరూరల్: మండలంలోని తులసీధామ వృద్ధాశ్రమాన్ని శనివారం జూనియర్ సివిల్ జడ్జి అశోక్ కుమార్ సందర్శించారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలు, హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టం ముందు ఎంతటి వారైనా సమానమేనని స్పష్టం చేశారు. వివిధ చట్టాలపై వృద్ధులకు అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు పంచిపెట్టారు.

ఏపీఓ గోపాల్ సేవలు అమూల్యం



ఉపాధి ఏపీఓ గోపాల్ దంపతులను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

అమరాపురం: ఉపాధి హామీ ఏపీఓ గోపాల్ సేవలు మరువలేనివని ఎంపీడీఓ మునిస్వామి, జేఈ జగదీష్, ఏపీఓ హెన్రీ తదితరులు కొనియాడారు. శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గోపాల్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ఏపీఓగా గోపాల్ చాలా చక్కగా విధులు నిర్వర్తించారన్నారు. కూలీలకు వంద రోజుల పని కల్పించారన్నారు. అనంతరం గోపాల్ దంపతులను శాలువా పూలమాలలు, కానుకలతో తోటి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, టీఏలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉరకలేస్తున్న క్రీడోత్సాహం



అగళిలో వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు



రొద్దంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళా క్రీడాకారులు,



పెనుకొండ మండలం మునిమడుగులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

- కొనసాగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

హిందూపురం అర్బన్: మండలంలోని తూమకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం క్రికెట్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి, దేవరాజ్, తిమ్మయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువతలో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అగళి: మండల వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో శనివారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రీడా పోటీలను ఎంఈఓ–2 చంద్రశేఖర్, పీఈటీ నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శి వేణు, రంగనాథ్ పర్యవేక్షించారు.

మడకశిరరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యతో పాటు క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్నారని జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీపీ కవిత తెలిపారు. శనివారం గౌడనహళ్లి, ఆర్.అనంతపురం, కదిరేపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికితీయవచ్చన్నారు. యువత, విద్యార్థులకు ఈ పోటీలు సద్వినియోగం చేసుకుని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అంజినమ్మ, పుట్టమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, పాఠశాల కమిటీ చైర్మన్ నర్సేగౌడు, ఎంపీటీసీలు, వివిధ కమిటీల నాయకులు జమ్మానిపల్లి మూర్తి, సత్యనారాయణరెడ్డి, తిమ్మప్ప, బాబిరెడ్డి, హనుమంతరాయప్ప, వెంకటేష్, పీఈటీలు, అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రొద్దం/గోరంట్ల/పెనుకొండ రూరల్: రొద్దం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాయాల్లో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. గోరంట్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీల సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామంలో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు జరిగాయి. గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటుకోవాలని అధికారులు తెలిపారు.



మడకశిర మండలం గౌడనహళ్లిలో క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం



మడకశిర మండలం ఆర్.అనంతపురంలో వాలీబాల్ పోటీలు

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



చౌళూరులో పథకాల కరపత్రాలను అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, నాయకురాలు మధుమతిరెడ్డి

- హిందూపురాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో పార్టీ సమన్వయకర్త టిఎన్.దీపిక

హిందూపురం: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను ఆశీర్వదించాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక కోరారు. శనివారం హిందూపురం మండలంలోని చౌళూరు గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతి రెడ్డి, సర్పంచ్ నంజప్ప, ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమన్వయకర్త దీపిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత వలంటీర్లు, అధికారులకు సూచించారు. అయా కుటుంబాలకు సంక్షేమ లబ్ధి అందించాలని కోరారు. తాము ఎటువంటి సిఫార్సులు లేకుండా పథకాలు పొందుతున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం టిఎన్.దీపిక మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. ఇచ్చిన మాట నిలుపుకోవడంలో జగనన్న దేశానికే ఆదర్శమన్నారు. నియోజకవర్గంలో ఒకసారి మార్పుకు శ్రీకారం చుట్టాలని కోరారు. హిందూపూరం ఎమ్మెల్యే బాలకృష్ణ రెండుసార్లు గెలిచినా ఏ ఒక్కసారైనా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పని చేసే ప్రభుత్వానికి, ప్రజలకు అందుబాటులో ఉన్నా నాయకులను ఆదరించాలని కోరారు. ఈ సారి వైఎస్సార్‌సీపీకి ఒక అవకాశం ఇవ్వండి.. హిందూపురం అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకులు చంద్రహాస్, ఎంపీడీఓ నరేంద్ర, వైస్ ఎంపీపీలు రఘునాథరెడ్డి, రామంజి, మండల కన్వీనర్ రాము, సర్పంచ్ దేవరాజు, సింగల్ విండో అధ్యక్షుడు రంగనాథ్, పార్టీ నాయకులు లోకేష్‌రెడ్డి, రాజు, చౌడప్ప, సోమశేఖర్ రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, మజీద్, రాజు, రామంజప్ప, సురేష్, సూరి, సుబ్బరెడ్డి, అజయ్, అశ్వత్తమ్మ, విజయమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యం



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్

పెనుకొండ: పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ సమావేశ భవనంలో శనివారం పాలకవర్గ సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ.. రానున్న వేసవిలో పట్టణంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. సమస్య తలెత్తకుండా రూ.90 లక్షలతో పైప్‌లైన్ వేయించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పైప్‌లను డంప్ చేశామని తెలిపారు. త్వరలో పైప్‌లైన్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నారాయణమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, వజ్రాలపేట, జీబీసీ కాలనీ తదితర ప్రాంతాలకు నిరవధికంగా నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. చైర్మన్ ఉమర్‌ఫారూఖ్‌కాన్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో కొంతమేరకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పట్టణంలోని పలు వీధుల్లో రోడ్లపైకి నీరు నిరవధికంగా ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిని అరికట్టాలని కౌన్సిలర్ రఘునాథరెడ్డి సూచించారు. అదేవిధంగా కౌన్సిలర్ సద్దాం పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, తయాబ్, బోయ హారతి, ఫర్జియాభాను, సబిహాభాను, అంజలి, సంజీవమ్మ, నాగరత్న, శేషాద్రి, లావణ్య, చంద్రకళ, రామాంజనేయులు, భాస్కర్‌నాయక్, కో–ఆప్షన్ మెంబర్లు వెంకటరామిరెడ్డి, నేమతుల్లా, ముహీబా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సోమందేపల్లి మండలం చల్లాపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

రొళ్ల: రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓఆర్డీ క్రిష్టప్ప పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని గుడ్డగుర్కి ఎస్సీ కాలనీలో 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, ఎంపీటీసీ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి ఎస్సీ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ.. హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరైనా హక్కులను కాలరాస్తే చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యమంలో ఎస్‌ఐ విజయ్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని తహసీల్దార్ అనంతచారి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ రామంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కె.శివరం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు గ్లాసుల పద్ధతిని మానుకోవాలని సూచించారు. సమాజంలో అంటరానితనాన్ని నిషేధించడం జరిగిందని గుర్తు చేశారు. సమాజంలో ఎవరైనా కుల వివక్షత చూపితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఏఎం లింగణ్ణ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఏఐసీసీ మెంబర్ కేటీ శ్రీధర్

పరిగి: స్వాతంత్ర్య సమరంలో ఏఎం లింగణ్ణ చేసిన సేవలు అమోఘని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని సేవామందిరం 81వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎం లింగణ్ణ విద్యా సంస్థల ప్రస్తుత అధ్యక్షుడు కేటీ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి నీల కంఠాపురం రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ పిలుపు మేరకు సేవామందిరాన్ని ఏఎం లింగణ్ణ స్థాపించారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అనేక మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు వీఎన్ రెడ్డి, ప్రముఖ కవులు, మేధావులు పాల్గొన్నారు.

మడకశిరలో పర్యటించిన ఎంపీ రంగయ్య



ఎంపీ తలారి రంగయ్యను సన్మానించిన వాల్మీకి సంఘం నాయకులు

మడకశిర: అనంతపురం ఎంపీ తలారి రంగయ్య శనివారం మడకశిరలో పర్యటించారు. పట్టణ వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు ప్రథమ వర్ధంతి ఆదివారం జరగనుండటంతో కుటుంబ సభ్యులను కలిశారు. ఆంజనేయులు సమాధిని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఆంజనేయులు కుమారుడు మోహన్‌కుమార్‌ను పరామర్శించారు. అనంతరం పట్టణంలోని వాల్మీకి సంఘం నాయకులను కలిశారు. బోయ కార్పొరేషన్ డైరెక్టర్ బీఎల్ రామకృష్ణ ఇంట్లో వాల్మీకి సంఘం నాయకులతో సమావేశమయ్యారు. వాల్మీకి సంఘం నాయకుడు కల్లుమర్రి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బేకరి నాగరాజు తదితరులు ఎంపీ రంగయ్యను కలిసి సన్మానించారు.

బీఐటీలో స్కాలర్‌షిప్ టెస్ట్



స్కాలర్‌షిప్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

హిందూపురం అర్బన్: పట్టణ సమీపంలోని బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 2024 సంవత్సరంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. హిందూపురం, గోరంట్ల, పెనుకొండ, లేపాక్షి, మడకశిర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ టెస్ట్‌కు హాజరయ్యారు. విజేతల వివరాలను త్వరలో వెల్లడిస్తామని సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించిన కళాశాల సిబ్బందిని ప్రిన్సిపాల్ రమేష్, చైర్మన్ చంద్రమోహన్ అభినందించారు.

నాణ్యమైన విద్య అందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి వసతి పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమైందన్నారు. స్వామి జపానంద మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదగడానికి కృషి చేయాలన్నారు. విద్య జ్ఞానాన్ని పెంపొందిస్తే క్రమశిక్షణ సత్ప్రవర్తన కల్గిస్తుందన్నారు. అనంతరం ఆన్‌లైన్ విద్యా యోజనను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కస్తూరి కుమార్ తదితర ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

చాగలేరులో క్రీడా పోటీలు ప్రారంభం



యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి

చిలమత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండలంలోని చాగలేరులో క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు వచ్చినా ఆడించడానికి నియమితులైన అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని, మరోసారి ఇలాంటివి చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామ్లా నాయక్, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనాథ్, నయీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహంలో ఎస్‌ఎఫ్‌ఐ 54వ ఆవిర్భవ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబావలి ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురునాథ్, బాబా ఫకృద్దీన్, సుభాష్, హేమంత్, జగదీష్, వినయ్, ఎంజారప్ప, వీర, మంజునాథ్, విష్ణు పాల్గొన్నారు.

తీరిన నీటి సమస్య

గుడిబండ: గుడ్డదహళ్లి గ్రామంలో శనివారం కొత్తగా బోరుబావి తవ్వించగా 520 అడుగులకే సుమారు 3 ఇంచుల నీరు పడినట్లు సర్పంచ్ సతీష్, ఉప సర్పంచ్ మంజునాథ్ తెలిపారు. ఇటీవల తాగునీటి సమస్య ఉన్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో బోరు వేయించేందుకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. నీరు సమృద్ధిగా పడటంతో సమస్య పరిష్కారమైందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ గంగన్న, నాయకులు కేశవమూర్తి, వలంటీర్ మూర్తి పాల్గొన్నారు.

పాఠశాల పున: ప్రారంభించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని భీమరాయనపల్లిలో 2015 నవంబర్‌లో మూతపడిన ప్రాథమిక పాఠశాలను పున: ప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. శనివారం ఎంఈఓ భాస్కర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు వినతిపత్రం అందజేశారు. 1 నుంచి 5వ తరగతి వరకూ చదువుతున్న 29 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెందకచెర్లు పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పాఠశాలను ప్రారంభించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

అయోధ్య అక్షింతల ఊరేగింపు

గోరంట్ల: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో అయోధ్య సీతారాముల అక్షింతలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. తొలుత అయోధ్య రామయ్య అక్షింతలను వినాయక గుడిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

రేపు మెగా రక్తదానం శిబిరం

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో జనవరి 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మెగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, హొట్టేబెట్ట సర్పంచ్ ప్రకాష్, హులికుంట వైస్ సర్పంచ్ రవి కుమార్, నాయకుడు నగేష్ రంగారెడ్డి శనివారం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ

రొళ్ల: మండల వ్యాప్తంగా జనవరి 1వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్, ఎస్‌ఆర్‌పీ కాంతయ్య, ఏపీఓ ఓబుళప్ప శనివారం తెలిపారు.

అధికారులు హాజరుకాకపోతే ఎలా?



కౌన్సిల్ హాల్ నుంచి వెళ్లిపోతున్న కౌన్సిలర్లు

హిందూపురం: నెలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి కూడా అధికారులు హాజరుకాకపోతే ప్రజా సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. అయితే సమావేశానికి కౌన్సిలర్లు అందరూ హాజరైనా కమిషనర్ రావడం ఆలస్యమైంది. దీంతో అసహనానికి గురైన మున్సిపల్ కౌన్సిలర్లు మీటింగ్ నుంచి అర్థాంతరంగా బయటకు వెళ్లిపోయారు. ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్, అదే సమయంలో పారిశుధ్య కార్మికుల ఆందోళన వల్ల కాస్త ఆలస్యంగా వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఇంతలో కౌన్సిలర్లు అపార్థం చేసుకుని వెళ్లిపోవడం జరిగిందని వివరణ ఇచ్చారు.

ఏపీటీఎఫ్, యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

మడకశిర: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు భాస్కర్, నరసింహ మూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రామకృష్ణ, లతా రామకృష్ణ, వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, రాఘవేంద్రరావు, తిమ్మారెడ్డి, ముద్దు నాగప్ప, బాలరాజు, సోమశేఖర్, మురళీధర్, జయరాములు, మారుతి, కొత్త రాయుడు, రామాంజనేయులు, హైదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అగళి: స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంఈఓ–2 చంద్రశేఖర్ నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కాటప్ప, మండల అధ్యక్షుడు శివశంకర్, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యాయులు అమరనాథ్, దేవరాజు, హసీనా పాల్గొన్నారు.

పప్పుశనగ పరిశీలన

పరిగి: మండల పరిధిలో హొన్నంపల్లి పరిసరాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను మండల వ్యవసాయాధికారి విజయభారతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు అధ్యక్షుడు గోవిందరెడ్డి, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.